21.

# జీవులందఱు భగవదంశములే

కానిపించెడి జగతిలో కానరాక
అందు వెలుగొందు చైతన్యమాత్మరూపు
మణులయందున సూత్రంబు మాదిరిగను
విశ్వమంతయు వ్యాపించె విశ్వవిభుడు.

ప్రేమస్వరూపులారా!

"మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః" - అందరూ నా అంశమే అని భగవద్గీత జగత్తునకు చక్కని ఆదర్శాన్ని అందిస్తూ వచ్చింది. కానీ ఈ సత్యాన్ని గుర్తించక, ఈ విషయాన్ని విశ్వసించక అనేకమంది సాధకులుకూడను అనేక బాధలతో, అనేక దుఃఖములతో, అనేక విచారములతో భగవంతుడిని ప్రార్థిస్తుంటారు. నిజముగా "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అనేటువంటి విషయాన్ని విశ్వసించినటువంటి వారికి బాధలెక్కడ? భగవంతుడికి దుఃఖము లేదే? భగవంతునికి విచారములేదే? అలాంటి సమయంలో ఆ అంశమే నీయందున్నప్పుడు నీకెందుకీ దుఃఖం? నీకెందుకీ విచారం? కనుక భగవత్ అంశమే నీయందే ఉండిన నీవు దుఃఖించడానికి లేదు. కానీ సర్వజీవుల యందు ఈ అంశం ఉన్నది. కానీ సత్యాన్ని గుర్తించక అసత్యమైనటువంటి ప్రకృతిని విశ్వసించి, దివ్యత్వాన్ని మర్చిపోయి కేవలం పశుత్వంగా దుఃఖము, బాధ, కష్టమని విచారము చేస్తున్నారు. ఈ పశుత్వమో లేక చంచలత్వమో తన హృదయమును ఆవరించినది కానీ నిజంగా భగవంతునియొక్క అంశము అతని హృదయములో ఆవరించలేదు. ఇంక భగవద్గీతను చదివి ప్రయోజనమేమిటి? భగవద్విషయాన్ని విశ్వసించలేనటువంటి మానవుడు, దానిని ఆచరణలో పెట్టలేనటువంటి మానవుడు ఎన్ని గ్రంథములు చదివి ప్రయోజనమేమిటి?

ఒకానొక సమయములో అర్జునుడు కూడను ఇదే విధంగా ప్రార్థించాడు. "కృష్ణా! నిన్ను నిరంతరము స్మరిస్తున్నాను కదా! నాకెందుకీ సమస్యలంతా? ఈ

sri sathyasai vachanamrutam

యుద్ధమనేటువంటిది నాకెందుకు? ఈ కుటుంబ సంబంధమైనటువంటి విచారములు నాకెందుకు? నాకెందుకీ కష్టములు ప్రసాదిస్తున్నావు? అప్పుడు కృష్ణుడు నవ్వి, "అర్జునా! నిజముగా నీవు నీ రథముపైన నన్ను కూర్చో పెట్టుకున్నావు. కానీ బాహ్యమైనటువంటి రథముపైన కూర్చోపెట్టుకున్నావు కానీ నీ హృదయరథంలో నన్నెందుకు కూర్చోబెట్టుకోకూడదు? బయటది యంత్రము. లోపలది మంత్రము. నేను మంత్ర స్వరూపుడిని కానీ యంత్ర స్వరూపుడిని కాదు. నీవు నిరంతరము స్మరిస్తున్నట్లుగా నీవు భావిస్తున్నావు.

**స్మరణకాదు అనుస్మరణ చేయాలి**

"మాం అనుస్మరయుధ్య చ" - అనగా నీవు స్మరణ చేస్తున్నావు కానీ అనుస్మరణ చేయటంలేదు. ఈ స్మరణకు ఒక కాలము, ఒక నియమము, ఒక స్థానము అన్నటువంటివి ఉన్నవి. కానీ అనుస్మరణకు సర్వదా, సర్వకాలేషు, సర్వత్ర హరిచింతనం. కనుక ఇట్టి అనుస్మరణను నీవు అనుభవించినప్పుడే నా దివ్యత్వము నీవు గుర్తించగలవు. ఈ ప్రాకృతమైనటువంటి బాధలు నిన్నేమియును అంటరావు. 'మాం అనుస్మరయుధ్య చ" యుద్ధంనందు కూడను నన్నే నీవు స్మరించు. ఈ విధంగా స్మరిస్తున్నప్పుడు నీకు ఎట్టి బాధలు వుండవు.

స్వామీ! నేను సామన్య కుటుంబీకుడిని. ఆలుబిడ్డలతో, ఆస్తిపాస్తులతో రాజ్యవాంఛతో నేను ఈ విధమైనటువంటి అవస్థలు పడుతున్నటువంటి సమయంలో, "అనుస్మరణ" - నిరంతరము ఏ విధంగా స్మరించడానికి వీలవుతుంది? ఇవీ నీ కర్తవ్యములు. కానీ నీవు వీటిని వదలనక్కరలేదు. నీ అలుబిడ్డలను, నీ అస్తి పాస్తులను, నీ కర్తవ్యాలు నిర్వర్తించుకుంటూ పో. ఇది భగవంతుడు నీకిచ్చినటువంటి కర్తవ్యము. అతనిచ్చినటువంటి కర్తవ్యాన్ని నీవు నిర్వర్తిస్తూ పో. ఇవి చేసుకుంటూ కూడను నీవు భగవత్ ప్రసాదంగా నీవు విశ్వసించు. ఈ విధంగా నీవు సరియైనటువంటి చింతన చేసినప్పుడే దివ్యత్వమనేటువంటి దానిని గుర్తించి ఈ బాధలు నీకే మాత్రమూ అంటవు అన్నాడు.

**అనపేక్ష తారకం - అపేక్ష మారకం**

sri sathyasai vachanamrutam

ఇక్కడ రెండు రకములైనటువంటి సాధనలు వున్నవి. ఒకటి ప్రాకృతమైనటువంటివి, అపేక్షతో చేసేటువంటివి. రెండవది నిరపేక్ష. అనగా నిరపేక్ష అనగా ఫలితములను తీసుకోకుండా పోవడం కాదు. దీనినే అనపేక్ష అనికూడ చెపుతారు. 'అనపేక్ష – తారకం', 'అపేక్ష – మారకం'. మారక తారకములనేటువంటి రెండు మార్గములలో మానవుడు ఈనాడు ప్రయాణము చేస్తున్నాడు.

మారకమనగా ఏమిటి? ఒక కాలేజీలో ఒక ప్రిన్సిపాల్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆ కాలేజీలో వున్నటువంటి సర్వసామానుకూడను ఆ ప్రిన్సిపాల్‌యొక్క అధీనంలో వుంటున్నవి. అన్ని సామానులు కూడను అతనిపైన అధికారముంటుంది. ఫర్నిచరే కాదు, అనేక పరికరములు, మిషన్లు కూడను వుంటున్నాయి. ఈ విలువైనటువంటి పదార్థములు, వస్తువుల కూడను అతని స్వాధీనములో వుంటున్నవి. కానీ అతనికొక ట్రాన్స్‌ఫర్ వచ్చిందంటే ఇన్ని సామానులు, ఇన్ని కుర్చీలు, ఇన్ని పరికరములు ఎట్లా నేను వదలిపోయేది అనేటువంటి విచారం చేయడు. “ఇవి ఏవీ నావి కావు. ఇదంతా ప్రభుత్వంవారిదే. కేవలం నాకొక కర్తవ్యాన్ని ఇచ్చారు. నేనొక ప్రిన్సిపాల్‌ని. వీటి క్షేమాన్ని చూసుకోవడమే నా కర్తవ్యం. ఏ పదార్థం కూడను నష్టం కలుగకుండా, ఇతరులు అపహరించకుండా దీనిని కాపాడుకోవడం నా కర్తవ్యం. అంతేగాని, ఇవేవీ నావి కావు” అన్న భావనతో తనకు ట్రాన్స్‌ఫర్ వస్తూనే వెళ్ళిపోతాడు. ఏమీ విచారం చేయడు. ఎట్టి బాధలు పడడు. ఎందువలన? ఇది నాది కాదు. ఇదంతా కూడను కేవలం ప్రభుత్వానిది, అని ఆనందంగా ఆ కాలేజీని వదలి పెడతాడు. అదే ప్రిన్సిపాల్ ఆ గ్రామమునందే వుండి ఒక అద్దె ఇంటిలో జీవిస్తూ వచ్చాడు. ట్రాన్స్‌ఫర్ అయ్యేటప్పటికి మరో గ్రామానికి ఆ ఇంటిలో ఉన్నటువంటి సర్వసామాగ్రి పేక్ చేసి లారీలో వేస్తాడు. కేవలం సామానులే కాదు. పాత చెప్పులు, పాత పరకలు కూడను పేక్ చేసి లారీలో వేస్తాడు. కారణమేమిటి? ఇవన్నీ నావి, నావి అనేటువంటి అభిమానం చేతనే ఈ పాతవి, పరకలు, చెప్పులు అన్నీ కూడను ఈ లారీలో వేసుకుని తీసుకువెళుతున్నాడు.

ఇక్కడ ఏది తారకము, ఏది మారకము? అభిమానంతో కూడినటు వంటిదే మారకము. ఎట్టి అపేక్షయు లేకుండా ఆ కళాశాలను వదలి తాను వెళ్ళిపోవటమే తారకము.



srisathyasaivachanamrutam

ఈ విధమైనటువంటి సాధనలోపల మానవుడు నిత్యజీవితాన్ని గడపాలి. ఏదీ మనకు శాశ్వతం కాదు. ఎవ్వరూ శాశ్వతం కాదు. ఉన్నంతవరకు మన కుటుంబాన్ని మనం చక్కగా గౌరవంగా కాపాడుకోవాలి. మన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. అయితే ఈ అభిమానం అనేటువంటి దాన్ని మనసులో పెట్టుకొని విచారం చేస్తూ వుంటే ఎంత కాలం విచారం చేయగలవు? ఎంత కాలం దీనిని వదలకుండా వుండగలవు? ఇవన్నీ కూడను కేవలం ఒక మాయ ప్రభావములే. కనుక మనము తారకము అనేటువంటి తత్త్వాన్ని చక్కగా గుర్తించాలి. ఉన్నంతవరకు అన్నింటినీ అనుభవించు. నీకు అవసరమైన రీతిగా దీనిని ఉపయోగించుకో, తప్పులేదు, కానీ, ఇవన్నీ కూడను నావి కాదు. అనేటువంటి సత్యాన్ని హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి. ఇది అంతా కూడను భగవంతుని యొక్క నిర్ణయము. భగవంతుడిచ్చినటువంటి వర ప్రసాదము. ఈ ప్రసాదాన్ని మనము సక్రమమైన మార్గంలో అనుభవించాలి. అదే విధముగనే ఈ జగత్తులో మనం వుండి ప్రాకృతమైన జగత్తును మనం అనుభవిస్తూ దేనిపైననూ అభిమానం అధికంగా పెట్టుకొనక ఈ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ పోవాలి. అప్పుడే మనకు సరియైనటువంటి శాంతి లభిస్తుంది. కానీ అట్టి శాంతికి విరుద్ధమైనటువంటి ఇక్కట్లకు కూడను గురి అవుతాము. అనేక విధమైనటువంటి అశాంతిని కూడను నీవు అనుభవిస్తావు.

**వర్తమానంలో తృప్తిగా జీవించాలి**

మనం ప్రపంచంలో వున్నాము. ప్రపంచం నుంచి మనం దూరం పోలేదు. కనుక ప్రపంచంలో వుండినంతవరకు కూడను ఈ ప్రపంచాన్ని మనం అనుభవించవలసిందే. అయితే, అనుభవిస్తూ ఈ ప్రపంచం నాది అనేటువంటి ఒక అభిమానంతో అనుభవించవద్దు. ఈ ప్రపంచమంతా కూడను భగవంతునిదే. సమస్త పదార్థములూ భగవంతునివే. సమస్త వ్యక్తులుకూడను భగవంతునియొక్క వ్యక్తులే. కారణము: "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః". ఈ సత్యాన్ని మనం చక్కగా విశ్వసించి మన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ పోవాలి. ఇంతియే కాక, ఈనాటి మానవుడు అనేక విధములైనటువంటి అసంతృప్తికరమైనటువంటి మాటలచేతనూ, పనులచేతనూ జీవిస్తూ వున్నాడు. ప్రతి విషయమునందు కూడను అసంతృప్తినే అనుభవిస్తూ వున్నాడు. కారణం:



sri sathyasai vahini

అనగా తాను లభించినటువంటి దానికి తృప్తి పడటం లేదు. వర్తమానంలో తృప్తి పడినటువంటి వ్యక్తియే నిజమైన వ్యక్తి. గడచిన దానిని తలచుకుంటూ, భవిష్యత్తు గురించి విచారము చేసుకుంటూ, వర్తమానాన్ని విసర్జించటం చేత మానవత్వములో అనేక విధములైనటువంటి అశాంతులు కలగుతున్నాయి.

**స్వార్థరహిత ప్రేమయే దివ్య ప్రేమ**

భగవంతుడు కేవలం ప్రేమస్వరూపుడు. ప్రేమ-ప్రేమచేతనే మనకు లభ్యమవుతుంది కానీ ద్వేషంచేత లభ్యంకాదు. ప్రేమకు ఎట్టి అనుమానం ఏమాత్రం వుండదు. ఎందుకనగా భగవంతుని ప్రేమ స్వార్థరహితమైన ప్రేమ. ఎక్కడ స్వార్థం వుంటుందో అక్కడే కొంత భయం ఏర్పడుతుంది. నిజంగా ప్రేమించేటువంటి వానికి భయమే వుండకూడదు. ప్రేమకు భయం లేదు. కారణము స్వార్థం లేదు. ఇంతియే కాక ప్రేమకు ఒక విధమైనటువంటి తత్ఫలము లేదు. ప్రేమకు ప్రేమనే ఫలము. ఇట్టి ప్రేమతత్త్వాన్ని వర్ధించి దివ్యమైనటువంటి మార్గంలో పోతుంటే ఎంత ధన్యమైన జీవితం జరుగుతుంది. కనుక ప్రేమ అందరియందూ వున్నది. ప్రేమలేని మానవుడు జగత్తులో కానరాడు. కానీ ఈ ప్రేమను ఒక విధమైనటువంటి స్వార్థంగా మనం అనుభవించకూడదు. భగవంతుని ప్రేమ ఇచ్చుకునేదే కాని పుచ్చుకునేది కాదు. ప్రాకృతమైనటువంటి ప్రేమ పుచ్చుకునేదే కానీ ఇచ్చుకునేది కాదు. ప్రాకృత ప్రేమకు, పరమాత్మ ప్రేమకు వుండినటువంటి భేదం ఇంతే. పరమాత్మ ప్రేమ ఇచ్చుకుంటుంది, ఇచ్చుకుంటుంది, ఇచ్చుకుంటుంది. కానీ స్వార్థమైనటువంటి ప్రాకృతమైనటువంటి ప్రేమ పుచ్చుకుంటుంది. పుచ్చుకోవడానికి సిద్ధంగా వుంటుంది. కానీ నా ఉద్దేశ్యం మానవునియందు కేవలం ఇచ్చుకునేది కానీ, పుచ్చుకునేది కానీ ఒకటి మాత్రమే వుండటం వల్ల ఏమాత్రమూ జరుగదు. ఈ ప్రాకృతమైన జీవితంలో, ఈ లౌకికమైన జీవితంలో, ఈ విధమైనటువంటి ప్రాకృతమైనటువంటి జీవితములో కేవలము ఇది one way traffic కాదు. ఇచ్చుకోవాలి, పుచ్చుకోవాలి. భగవంతుని దగ్గర పుచ్చుకోవాలి. ప్రకృతికి ఇచ్చుకోవాలి. ఇది ప్రతి మానవుని ప్రధాన కర్తవ్యము.

**అత్యాశే-దుఃఖహేతువు**

srisathyasaivacharamrutam

కానీ ఈనాటి మానవుడు ఈ విధమైనటువంటి మార్గమును అనుసరించటం లేదు. ఎక్కడకు పోయినప్పటికినీ పుచ్చుకోవాలి, పుచ్చుకోవాలి, పుచ్చుకోవాలి. ఇచ్చుకునేటువంటి మాట అతనిలో ఏమాత్రము కూడను కనిపించదు. కనుకనే మానవుడు అనేక విధములైనటువంటి దుఃఖములకు గురి అవుతున్నాడు. ఇది కేవలం పుచ్చుకునేటువంటిది ఇది తుచ్ఛమైన మార్గము, భగవంతుని దగ్గర పుచ్చుకునేది గొప్ప మార్గము. కానీ ప్రకృతి దగ్గర పుచ్చుకునేటువంటిది కూడను అల్ప మార్గము. అందుకోసమే ఒకానొక సమయంలోపల బుద్ధుడు తనలో తాను ప్రశ్నించుకున్నాడు. Who is the richest man in this world! నా తండ్రి richest అనుకుంటారు. చక్రవర్తులంతా richest అనుకుంటున్నారు. ఇది చాలా పొరపాటు. He who has much satisfaction is a richest man. Who is poorest man? He who has much desire is the poorest man. కనుకనే ఈ కోరికలను మనం క్రమక్రమేణా కూడను తగ్గించుకుంటూ పోయినప్పుడే భగవత్ ప్రేమను మనం పుచ్చుకునేటువంటి అధికారం మనకు లభిస్తుంది. కనుక ఈ స్వార్థమైనటువంటి ప్రేమను క్రమక్రమేణా సన్నగించుకుంటూ పోవాలి. ఈ కోరికలనేటువంటి దానిని క్రమక్రమేణా తగ్గించుకుంటూ పోవాలి. ఈ విధమైనటువంటి మార్గాన్ని అనుసరించినప్పుడే సరియైనటువంటి గమ్యాన్ని మనం చేరగలము.

ఈనాడు ఆధ్యాత్మిక మార్గమునందు అనేకమంది అనేక రకములైనటువంటి మార్గాన్ని అనుసరిస్తున్నారు. శ్రవణం – కీర్తనం అన్నారు. కృష్ణమూర్తి, మద్రాసు రాష్ట్ర అధ్యక్షుడు చెప్పాడు. కానీ ప్రాచీనకాలమునుండి ఈ చరిత్రలు కొన్ని సత్యం అయినప్పటికిని కొన్ని అపోహలకు అనేక విధములైనటువంటి మార్గాల్ని అందిస్తూ వస్తున్నాయి. విష్ణువు, శివుడు అనగా ఇంకా ప్రపంచమైనటువంటి భవితలో అనేక విధములైనటువంటి పేర్లు పిలుస్తూ వస్తున్నారు. ఈ బ్రహ్మ ఎవరు? ఈ విష్ణువు ఎవరు? ఈ శివుడు ఎవరు? ఈ బ్రహ్మ, విష్ణువు, శివుడు అనేటువంటిది మనయందున్నటువంటి గుణములే తప్ప అన్య రూపములు కాదు.

**రజస్సత్వతమో గుణములే బ్రహ్మవిష్ణు మహేశ్వరులు**

ఇంతవరకు శరీరధారులైనటువంటి బ్రహ్మవిష్ణుమహేశ్వరులను చూచిన



srisathyasaivachanamrutam

వారెవ్వరునూ లేరు. ఇలాంటి మాటలు వినటం చేతనే పాశ్చాత్యులకు కొన్ని విధములైనటువంటి భారతీయ సంస్కృతిపైన కొన్ని సందేహములు వస్తుంటాయి. ఇది కాదు సరియైనటువంటి అర్థము. మనలో ఉన్నటువంటి సాత్త్విక గుణమే విష్ణు తత్త్వము. మనయందున్నటువంటి రజో గుణ తత్త్వమే నిజమైనటువంటి బ్రహ్మతత్త్వము. మానవుని యందున్నటువంటి తమో గుణ లక్షణమే ఈశ్వరత్వము. అందుకోసమనే తమో గుణమనగా ఏమిటి? నిద్రకు కేవలం ఒక విధమైనటువంటి dullness కు అవకాశం యిస్తుంది అంటారు. కనుక ఈశ్వరుడనేటువంటివారు మనయందు తమోగుణంగా వుంటుండాది. ఇతనినే అర్థనారీశ్వర అని కూడా అంటున్నారు. అర్థనిమీలిత నేత్రుడు అని కూడా అంటున్నారు. అనగా కన్నులు పూర్తి తెరిచింది అంటే ప్రపంచమంతా కనిపిస్తుంది. కానీ అన్ని చంచలత్వము కూడను మనము చూడవచ్చును. దాని వల్ల మన యొక్క దృష్టి మరలిపోతుంది. పోనీ పూర్తి కన్నులు మూసుకుంటే నిద్ర వస్తుంది. కనుక పూర్తి నిద్ర రాకుండా, ఈ చలనత్వాన్ని పూర్తి దృష్టిలో పెట్టుకొనకుండా అర్ధనిమీలిత నేత్రం అని పెట్టుకున్నాడు ఈశ్వరుడు. అంతే కాక నాసికాగ్రముపై దృష్టిని వుంచుకోవడం. ఈ నాసికాగ్రముపైన దృష్టి వుంచుకున్నప్పుడు ఏదీ కూడా ప్రపంచం కూడను కనిపించదు. నిద్రనూ రాదు. ఇదియే ధ్యానమునకు సరియైనటువంటి అర్థం అని చెప్పారు. ఈశ్వరుడనగా ఎవరు?

**మౌళిగుల్కెడు చంద్రమఃఖండ కళతోడ**
**బెడగారు గుల్కెడు జడలతోడ**
**జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ**
**దంబైన ఫాలనేత్రంబుతోడ**
**నల్లనేరెడువంటి నల్లని మెడతోడ**
**కరమున నాగకంకణముతోడ**
**నడుమును చుట్టిన నాగచర్మముతోడ**
**మైనిండ నలరు భస్మంబుతోడ**
**నుదుట తీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో**

sri sathyasaivahanmu...

**తాంబూల రాగాధరంబుతోడ**
**ఆరు శాస్త్రములందున నందగించి**
**నల్ల కలువల హసియించి కొల్లలాడు**
**మెరుగు చామనచాయ మేనితోడ**
**పర్తివాసుడు నేడు సాక్షాత్కరించె.**

అనగా దైవము ఈశ్వరుడనగా ఏమిటి? మానవత్వము యొక్క సహజ లక్షణాన్ని ఆకారంగా ధరించినటువంటివాడు ఈశ్వరుడు. లయకారుడే ఈశ్వరుడు. దీనినే లింగము అని చెపుతూ వచ్చారు. "లీయతే గమ్యతే ఇతి లింగం". లింగం అనగా గమ్యాన్ని చేర్చేటువంటిది లింగము. అదియే తమోగుణము. అనగా గమ్యాన్ని చేరుస్తుంది.

ఇక విష్ణువనగా ఏమిటి? ఈ విష్ణుత్వం అనేటువంటిది రక్షణ కర్త. మానవుడు జన్మించిన తరువాత, ఆ జన్మించిన మానవునికి అనేక విధములైనటువంటి బాధలు అడ్డు తగులుతూ వుంటాయి. ఈ అడ్డు తగిలినటువంటి వాటినుండి రక్షించి అతనిని సుక్షేమమైనటువంటి మార్గానికి చేర్చటము.

బ్రహ్మ అనగా కేవలం సృష్టికర్త అని కాదు అర్థము. సర్వత్రా వ్యాపించినటువంటివాడు బ్రహ్మ. సర్వత్రా వ్యాపించినటువంటివాడు విష్ణువు. సర్వత్రా వ్యాపించినటువంటివాడు శివుడు. ఈ ముగ్గురు కూడను సర్వత్రా వుంటున్నారు. ముగ్గురు కూడను త్రికాలా బాధ్యులు, త్రిగుణాతీతులు. కేవలము ఆకారములు వేరువేరుగా దర్శనమిస్తూ వచ్చారు. విష్ణువుకు ఒక చక్రము, శంఖము పెట్టారు. అనగా ఈ శంఖం అంటే ఏమిటి? శబ్దము. చక్రం అనగా ఏమిటి కాలచక్రము. కాలము, కాబట్టి ఈ చక్రము రెండింటియొక్క శబ్దము రెండు కూడను భగవంతుని యొక్క స్వాధీనంలో వుంటున్నాయి. కనుకనే శబ్దం ఎక్కడినుంచి వస్తుంది? కేవలం నాభి నుంచి వస్తుంది. నాభి బ్రహ్మకు పుట్టుక స్థానము. ఈ నాభి నుండి పుట్టినటువంటివాడే బ్రహ్మ అనగా ఏమిటి? మూలాధారమైన శబ్దమే బ్రహ్మ. కేవలం బాహ్యమైనటువంటి శబ్దమే ఈ యొక్క విష్ణువు. నిశ్శబ్ద స్వరూపుడే ఈశ్వరుడు. కనుకనే ఈశ్వరుడు ఎప్పుడు కూడను ఒక ధ్యానంలో వుండినట్టుగా రూపిస్తూ వుంటుంది

srisathyasaivachanamrutam

బొమ్మలలో. సర్వులకునూ కనిపించేటువంటి తత్త్వము ఈ యొక్క ఏకత్వమే.

కనుక కాలము, కేవలం ఒక శబ్దము, బలము ఈ మూడు కూడను భగవంతునియొక్క స్వాధీనంలో వుంటున్నాయి. కనుకనే

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం.**

అన్నారు. ఈ త్రినేత్రము అనేటువంటిది ఏమిటి? కేవలము ఒక్క శివునికి మాత్రమే ఉన్నదా? భగవంతునియొక్క త్రినేత్రము ఇదియే. మానవునికి రెండు నేత్రములు ఉన్నాయి. భవిష్యత్తుని చూడగలడు. వర్తమానముని చూడగలడు. ఇవియే రెండు నేత్రములు. కానీ భగవంతుడు అది కాదు. భూతభవిష్యత్‌వర్తమానముని కూడా చూస్తాడు. మూడు కాలములూ చూడగలిగినటవంటివాడు కాబట్టి భగవంతుడిని ఇది ముమ్మూర్తి అన్నారు. ముక్కంటి అన్నారు. అంతేకాని ఈ నొసటిపైన మూడో కన్నున్నది అని కాదు. ఇవన్నీ కూడను కేవలము కల్పితమైనటువంటి భావన వలన వచ్చి దైవత్వాన్ని కించిత్ పరుస్తూ వచ్చినాయి.

**బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి**

కానీ సత్యస్వరూపాన్ని సాక్షాత్కారించినప్పుడు దైవత్వములో ఎట్టి భేదమూ లేదు. దైవం ఒక్కడే, జీవుడు ఒక్కడే. కనుకనే జీవత్వమే దైవత్వం, దైవత్వమే జీవత్వం. ఈ సత్యాన్ని మనం చక్కగా గుర్తించుకున్నప్పుడు మనలో దుర్భావములు కానీ దుశ్చింతనలు కానీ, దుశ్చేష్టలు కానీ మనలో ఏమాత్రమూ ఆవిర్భవించవు. మీరందరూ అనుకోవచ్చును: స్వామి, సామాన్య మానవుని నీవే దేవుడు, నీవే దేవుడు అంటున్నారే ఇది ఎట్లా సాధ్యమవుతుంది? అనుకుంటారు. You are God అని నీవు చింతించటం చేత ఏ ఫలితం మనకు లభ్యమవుతోంది? నేను దైవము అనుకున్నప్పుడు దైవభావాలే మనలో వస్తుంది కానీ దుర్భావములు మనలో ఆవిర్భవించవు. దీనినే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అనింది వేదం. Darwin తన యొక్క గురువైనటువంటి Henslove అతనిని స్మరించడం చేత ఆ యొక్క స్వరూపాన్ని పొందాడు. దారులు కొట్టె దొంగయైనటువంటి రత్నాకరుడు రామచింతన చేయటం చేత తనకు రామకళ కూడా ఉట్టి పడిపోయింది. ప్రహ్లాదుడు నిరంతరము కూడను హరినామాన్ని స్మరించడం చేత ఆ ప్రహ్లాదుని

sri sathyasai vachanamrutam

యొక్క ముఖమునందు కూడను హరి తేజస్సు ఆవిర్భవించింది. ఈ విధముగానే ఎవ్వరు దేనిని చింతిస్తారో ఆ యొక్క స్వరూపాన్ని పొందుతారు. ఈ ఉద్దేశ్యం చేత మీరు దైవస్వరూపులు అనుకున్నప్పుడు చెడ్డ మార్గంలో ఏమాత్రమూ ప్రవేశించరు. నేను దైవాన్ని, ఈ పనులు చేయవచ్చునా నేను? ఇది కేవలము ఒక విధమైనటువంటి చెడ్డవారు చేయవలసినటువంటి పని. కాబట్టి నేను దైవమును పవిత్రమైన కార్యములు చేయాలి. పవిత్రమైన మాటలు మాట్లాడాలి. పవిత్రమైనటువంటివి శ్రవణం చేయాలి. పవిత్రమైన మార్గంలో ప్రయాణం చేయాలి. అనేటువంటి హెచ్చరిక ఈ దైవత్వంనుంచి మనకు ఆవిర్భవిస్తుంది. అట్లు కాకుండా దైవం వేరు, నేను వేరు అనుకున్నంతవరకు కేవలం నీవు వేరుగానే వుంటుంటావు. దైవంతో ఏకం కావటానికి అవకాశం లేదు. దైవం మనకంటే వేరు కానే కాదు. దైవం కేవలం ఆత్మస్వరూపుడై సర్వులయందు కూడను ప్రకాశిస్తూ వున్నాడు. ఇతని పేరే conscience అన్నారు. కాబట్టి ఈ conscience ని నీవు ఫాలో చెయ్యి. అదే నేను అప్పుడప్పుడు చెప్పాను పిల్లలకు 4F లు. F, F, F, F కనుకనే: Follow the Master, Face the devil, Fight to the end, Finish the game.

**4F లు**

Follow the Master అన్నాను. ఎవరు నీ మాష్టరు? నీ భగవంతుడే నీ మాష్టరు. కాబట్టి నీ మాష్టరు అంటే నీ conscience యే నీ మాష్టరు. కనుక నీ conscience ని నీవు ఫాలో చేయి.

Face the devil అనగా ఏమిటనుకున్నారు మీరు? కేవలం ధనం క్రింద పోతుంది ఈ ధనాశను నీవు పెట్టుకోవద్దు. ఈ దీనిని మనం వెనుకకు తోయాలి.

Fight to the end, Finish the game. అదియే మన ముక్తి. ముక్తి అనగా ఏమిటి? మన జీవితమనేటువంటి దానిని అంత్యం చేసుకున్నాం. కనుకనే మనము జీవితము అనేటువంటి దానిని పొందుతూ వుంటున్నాము. దైవత్వాన్ని పొందుతున్నాము. అంతా మనయందే వుంటున్నది. మానవునకు మించినటువంటిది ఈ జగత్తులో మరొకటి లేదు. మానవత్వంలో ఇంత శక్తి వున్నదని ఎవ్వరూ కూడను గుర్తించేదానికి ప్రయత్నించడం లేదు.

sri sathyasai vahini amrutam

మానవుని యందున్నటువంటి శక్తియే దైవమునందుంటున్నది. దైవమునందున్నటువంటి శక్తియే మానవునియందుంటున్నది. ప్రయత్నం చేస్తే ఎంతటి ఘనకార్యమైనా మనం సాధించవచ్చును. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' కానీ ఈ పిచ్చికోతివంటి మనస్సును మనం ధరించటం చేత తద్వారా అన్నీ మనకు అనుమానాలే వస్తుంటాయి.

## శ్రీకృష్ణుని దివ్యలీలలు

ఒకానొక సమయంలో చిన్న వయస్సునందు కృష్ణుడు ఆ గోకులంలో గొప్ప కుంభవర్షం కురుస్తూ వచ్చింది. అప్పుడు కృష్ణుడు అందరినీ పిలిచాడు. మీరందరూ రండి నేనీ కొండను ఎత్తగలను. దీనిక్రింద మీరు జీవించండి అన్నాడు. కానీ నమ్మకమున్నటువంటి వారు వెళ్ళారు. నమ్మకం లేనటువంటి వారు 'బాలుండే ఇతడు కొండ దొడ్డది మా భారంబు ఇతడు మోయంగ జాలాడా?' ఇతను మోయగలడా? మన తలపైన వేస్తాడో, ఏమో! అని సందేహంతో వెనక్కు వెళ్ళారు. వాళ్ళంతా మరణించారు. ఎవ్వరు నమ్మకం చేత ఆ పెద్దకొండ క్రిందకు వచ్చి చేరారో వారందరూ రక్షింపబడ్డారు. అదే విధముగనే కృష్ణునియొక్క మహత్తరమైన శక్తులు తల్లికి చూపించదలచి బలరాముడు తల్లి దగ్గరకు వచ్చి అనేక చాడీలు చెప్పాడు. శ్రీకృష్ణుడిపైన చాడీలు చేయటం కాదు బలరామునియొక్క పని, తల్లికి కృష్ణుడు ఇంతటివాడు అనేటువంటి తత్త్వం గుర్తించాలని ఈ పని చేశాడు. 'అమ్మా! మన ఇంటిలో కావలసినన్ని వుంటున్నాయి. ఇన్ని వుండినప్పటికిని కేవలం బజారులో పోయి మట్టి తింటున్నాడు.' అనేటప్పటికి తల్లికి చాలా బాధ కలిగింది.

**పెట్టినది తినవు గొల్లల**
**పట్టులకుంబోయి వెన్న పట్టెదులుగ లో**
**గుట్టున తినెదవు నీతో**
**పుట్టెను రట్టళ్ళు కృష్ణ! పొమ్ము కుమారా!**

ఇంతియే కాకుండా బజారులో వున్నటువంటి మట్టి తినటమా? చెయ్యి పట్టుకుంది. నోరు తెరచు అని రెండు చెంపలూ కొట్టింది, యశోద. కృష్ణుడు నవ్వుతూ చెప్తున్నాడు: 'అమ్మా!

మన్ను తినంగ నే శిశువునా? ఆకొంటినా? వెఱ్ఱినా?' నాకేం ఆకలి లేదు. నేను తెలివిలేనివాడును కాదు. నేను చిన్న బిడ్డను కాదు. అమ్మా! ఎందుకు నన్ను ఈ విధంగా బాధిస్తావు? నేను బాలుడ కాదు, నాకు ఆకలి లేదు, నేను పిచ్చివాడిని కాదు. కనుక నేను మన్ను తినటమంటే ఏమైనా అర్థం ఉందా? చూడమని నోరు తెరిచాడు. విశ్వమంతా కనిపించింది, ఆ కృష్ణుని నోటిలో. దానిని చూచింది యశోద.

**కలయో వైష్ణవ మాయయో ఇతర సంకల్పార్థమో**
**సత్యమో తెలుపన్నేరక ఉన్నదాననో యశోదా దేవి కానో**

నేను యశోదనా? కాదా? నేను చూచేదంతా సత్యమా? కాదా? అనేటువంటి అపోహలు ఆమెకు వచ్చి కట్టకడపటికి 'భగవంతుడు సామాన్యుడు కాడు. నా కుమారుడు సామాన్యుడు కాడు.' తల్లియందున్నటువంటి సందేహము పూర్తి నివారణ గావించదలచి బలరాముడు ఈ విధమైనటువంటి యుక్తిని చేశాడు. ఇంతియే కాదు. తల్లికి ఈ రహస్యాన్ని చక్కగా బోధింప దలంచి బయట బలరామకృష్ణులిద్దరూ ఆడుకుంటున్న సమయంలోపల అమ్మ అక్కడ మనకోసం కాచుకుని వుంటాది మనం ఇంటికి వెళ్దాం రా! అన్నాడు కృష్ణుడు. తక్షణమే బలరాముడు చెప్పాడు: 'కృష్ణా! యశోద నీ తల్లి అనుకుంటున్నావా? కాదు, కాదు. యశోద నీ తల్లి అయితే; యశోద తెల్లగా వుంది, నందుడు తెల్లగా వున్నాడు. నీవెందుకు నల్లగున్నావు! నందయశోదల కొడుకు కాదు నీవు' సత్యమే చెప్పాడు బలరాముడు. కానీ వెళ్ళి తల్లి దగ్గర చెప్పాడు. 'అమ్మా! నేను నీ కొడుకును కాదట' ఆమె కూడను అర్థం చేసుకుని బలరాముడు చెప్పినది సత్యమే. నాకు కొడుకుగా పుట్టలేదు నాయనా నీవు. కానీ నీవు దేవకీ దేవి కుమారుడవు. ఈవిధంగా వుంటున్నప్పుడు దేవకిదేవి కూడను ఆ మధురలోపల చాలా బాధ పడుతుందట. దైవము మానుష రూపాన్ని ధరించినప్పుడు అందరికి బాధలుగానే వుంటుంటాయి. ఈ బాధలు పడక దైవత్వం అనేటువంటిది బయటకు రాదు.

**బాధలలోనే దైవత్వం అనుభవానికి వస్తుంది**

**పిలచి అడుగ చెఱకు పెట్టునా బెల్లంబు**

**పిప్పిగొట్టి రసము పీల్చుకున్న**
**జాతివజ్రమైన సానబట్టవలయు**
**గురువు తీర్చుకున్న గుణము సున్న.**

కనుకనే మనము చెఱకును పిలిచి బెల్లము పెట్టు అని అంటే పెట్టదది. అనకే రకములైనటువంటి బాధలు పెట్టినప్పుడే, పీల్చి పిప్పి చేసినప్పుడే దానికి కాల్చినప్పుడే అది బెల్లంగా శాశ్వత రూపము దాల్చుతుంది. దేహమే ఒక చెఱకు. ఈ బాధలు, కష్టములే దీన్ని పిప్పి చేసేటువంటి మిషను. తద్వారా దైవత్వం అనేటువంటి రసం మనకు ప్రాప్తిస్తుంది. అప్పుడే 'రసోవైసః' అని వస్తుంది. ఈ రసస్వరూపమే భగవంతుడు బ్రహ్మ అని. కనుక కన్న తల్లితండ్రులకునూ పెంచిన తల్లిదండ్రులకు కూడను నిరంతరమూ బాధలే. యశోద ఈ విధంగా బాధపడుతుంటే దేవకీదేవి ఇంకొక రకంగా బాధపడుతుండాది. 'నీ బొజ్జను ఎన్నో త్రాళ్ళతో కట్టిందట ఆ యశోద. కానీ ఎన్ని త్రాళ్ళు కట్టినా కానీ నీ బొజ్జ నిండలేదట. ఇవన్నీ నేను చూడలేకపోయాను.

**బిడ్డదుండియూ నేకొక గొడ్డురాలు**
**బిడ్డ కనకుండిననూ పుత్రవతి యశోద**
**ఇది నా ఖర్మమా? ఆమె అదృష్టమా?**

అని ఏడుస్తూ వుంటుండాది. ఇదే విధంగానే రామాయణంనందు కూడను కేవలము కౌసల్య చాలా బాధపడుతూ వచ్చింది. దైవమైనటువంటి రాములనే నేను కుమారునిగా కన్నాను. కానీ ఆ ఆనందాన్ని నేను అనుభవించలేకపోయాను. ఎక్కడైనా కూడా ఏ అవతారమునందైనా కూడను కన్న తల్లికి, పెంచిన తల్లికీ ఎప్పుడు బాధలే. కారణం తనయందున్నటువంటి దైవత్వాన్ని లోకానికి వ్యాప్తి గావించే నిమిత్తమై ఈ విధమైనటువంటి నాటకములాడుతుంటాడు దైవం.

రాముడు తండ్రి ఆజ్ఞను నడుచుకోవలసినటువంటి అవసరము ఏమున్నాది? కాదు పితృ వాక్య పరిపాలకుడు రాముడు అనేటువంటి సార్థకనామాన్ని జగత్తుకు అందించాలి. అదే విధముగనే అన్ని అవతారములు కూడను ఈ జగత్తునకు దైవత్వాన్ని వ్యాపింప చేసే

srisathyasaivachanamrutam

నిమిత్తమై ఇన్ని రకములైనటువంటి నాటకములు చేయవలసి వస్తుంది. కానీ భక్తులు దీనిని చక్కగా గుర్తించలేరు.

**భగవంతుడు ఏది చేసినా ప్రేమచేతనే అని గుర్తించాలి**

ఎందువలననగా దైవం ఒక్కడే అయినప్పటికినీ ఒక్కొక్క సమయంలోపల అనేక రకములైనటువంటి చేష్టలు చేయవలసి వస్తుంది. మీకందరికీ తెలుసు, రాత్రి పెద్ద వర్షం వచ్చింది. ఈ వర్ష బిందువులూ నీరే. తరువాత వడగళ్ళు పడ్డాయి. ఆ వడగళ్ళు కూడా నీరే. కానీ వర్షం దెబ్బకొట్టదు కానీ వడగళ్ళు దెబ్బకొడుతుంది. వడగళ్ళు తగిలితే దెబ్బ తగులుతుంది. నీరు తగిలితే దెబ్బ తగలదు. అదే విధముగనే భగవంతుడు ప్రేమతో తిట్టినా, కొట్టినా అంతా కూడను భగవంతునియొక్క ప్రేమనే. కొట్టినప్పుడు మంచుగడ్డతో కొట్టినట్టుగా వుంటాది. కానీ ఆ మంచుగడ్డలోపలనూ జలమే వున్నది. అందులో కూడను ప్రేమనే వుంటున్నదనేటువంటి సత్యాన్ని మనం గుర్తించాలి. భగవంతుడు ఏది చేసినా కానీ ప్రేమతోనే చేస్తున్నాడు కానీ ప్రేమకు భిన్నంగా చేయడానికి వీలు కాదు. కష్టం పెట్టనీ, దుఃఖము పెట్టనీ, విచారం చేయనీ, అనేక విధములైనటువంటి పరీక్ష నీకు చేసినప్పటికినీ అదంతా ప్రేమ చేతనే. కనుక మనం ఏమాత్రం కూడను విచారం చేయకూడదు. విచారం చేయటం మనయొక్క దోషమే. ఎందుకంటే మనము భగవత్ అంశము. అలాంటి అంశమునకు దుఃఖము లేదు. బాధలు లేవు. కష్టములు లేవు. కనుక నేను భగవత్ అంశము అనేటువంటి విశ్వాసాన్ని మనం పెంచుకోవాలి. కనుక మనము ఏ విధమైనటువంటి బాధలకు గురి కాకూడదు. దీన్నంతా ఎదుర్కొని మనం ప్రేమను సాధించటానికి ప్రయత్నం చేయాలి.

**అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించండి**

ఒక్కొక్కరికి ఒక్కొక్క ప్రీతికరమైనటువంటి భావం ఇష్టం వుంటాది కానీ ఆ ప్రీతి అన్నింటియందు కూడను ఒక్కటే. ఒకరు లడ్డు కావాలంటాడు. ఒకరు బర్ఫీ కావాలంటాడు. ఇంకొకడు జిలేబి కావాలంటాడు. ఇది జిహ్వా చాపల్యమే కానీ అన్నిటియందున్నటువంటి చక్కెర ఒక్కటే. కనుక ఒక్కొక్కరి సాధన ఒక్కొక్క రకమైనటువంటి మార్గంలో వుంటుంది.

srisathyasaivachanamrutam

కాబట్టి ఒకరి సాధనను ఒకరు విమర్శించటానికి ఏమాత్రం అధికారం లేదు. ఎవరు ఏది చేసినప్పటికిని వారికి ఆ ఫలితం లభిస్తూనే వుంటాది. అది వారికి ప్రీతి. ఆ ప్రీతికి తగినటువంటి ఫలితం వాళ్ళకు లభిస్తూనే వుంటుంది. కనుకనే దైవత్వాన్ని ఎవ్వరూ కూడను ఏ విధంగా కూడను విమర్శించడానికి పూనుకోకూడదు. దైవత్వం దైవత్వమే. అట్టి దైవత్వాన్ని దివ్యత్వమైనటువంటి భావముతో మనము అందుకోవాలి. కనుక అనేకమంది సాధకులంతా అనేక విదేశీయులు కూడను ఇక్కడ ప్రవేశించి అనేక విధములుగా సాధన చేస్తున్నారు, మీరు వింటూనే వున్నారు. నా ఉద్దేశ్యమేమనగా రాముడు, కృష్ణుడు, విష్ణువు, శివుడు, ఈశ్వరుడు, బ్రహ్మ ఈ రకములైనటువంటి భేదములు అన్నింటియందు కూడను రూపనామములు భేదముండినట్టుగా వుంటాది కానీ దైవం ఒక్కడే అనేటువంటి సత్యాన్ని గుర్తించండి. ఈ ఏకత్వాన్ని మాత్రం మీరు విశ్వసించండి. మీరు జీసస్ అనుకోండి, రాముడనుకోండి, కృష్ణుడనుకోండి, విష్ణువనుకోండి, బ్రహ్మ అనుకోండి, ఈశ్వరుడనుకోండి. కనుక ఏ పేరు పెట్టుకున్నప్పటికినీ దైవం ఒక్కడే. 'ఏకంసత్ విప్రా బహుధా వదంతి' అని అనేకమంది మహా పురుషులు చెప్పారు. దీని అన్నింటియందు కూడను 'ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ' అన్నారు. మీకందరికినీ తెలుసు ఇక్కడ హార్మోనియం వాయిస్తుంటారు. నీక్కూడా హార్మోనియం విషయం తెలుసును. కానీ హార్మోనియం వాయించేటప్పుడు శృతి ఒక్కటే అవుతుంది. ఒక్కొక్క రీడ్ వత్తినప్పుడు స, రి, గ, మ, ప, ద, ని అని శబ్దములు వేరు వేరుగా వినిపిస్తాయి. సౌండ్ వేరు గాని గాలి ఒక్కటే.

అదే విధముగనే మనకు పేరు, రూపములు వేరు వేరుగా వుంటున్నాయి కానీ దివ్యత్వమనేటువంటిది ఒక్కటే వుంటుంది. కనుక ఆ దివ్యత్వాన్ని మీరు గుర్తునందుంచుకోండి. ఆ దివ్యత్వాన్ని మీ హృదయంలో ప్రతిష్ఠ చేసుకోండి. 'అర్జునా! నన్ను బయట రథములో కూర్చో బెట్టకు. నేను బయట మనిషిని కాదు. నేను లోపలి ఇంటివాడిని. నీ హృదయమనేటువంటి రథంలో నన్ను కూర్చో పెట్టుకో. అక్కడ నాకు స్థానం ఇచ్చేసెయ్యి. అక్కడ నేను మంత్ర స్వరూపుడై పోతాను. బయట వుండినంతవరకు యంత్ర స్వరూపుడై పోతాను. కాబట్టి యంత్రమనేటువంటిది కేవలం ఒక్క పని చేసేటువంటిదే కానీ దానికి లైఫ్ లేదు. మంత్రము ఎంతటి పనైనా చేస్తుంది. ఎంతటి సాహసాన్నైనా అరికట్టుతుంది. కనుక

మంత్రస్వరూపుడు భగవంతుడు. కనుక అతనిని హృదయ పీఠంపైన ప్రతిష్ఠ చేసుకోవాలి. అతని నివాసము హృదయమే. కనుకనే అతనికి హృదయవాసి అని పేరు పెట్టారు. కనుక హృదయమునందు స్థానం ఇవ్వండి. కేవలం బయట ప్రపంచంలో మనము కేవలం స్థానమునిచ్చి మనము కేవలం అకాశమును పోగొట్టుకుంటున్నాము మన విశ్వాసాన్ని ఎంతకాలం నీవు బాహ్యదృష్టితో చూసుకుంటావో ఇదంతా 'పశ్యతీతి పశుః' బాహ్యదృష్టి అనేటువంటిది పశువుది. అంతర్దృష్టిని అభివృద్ధి చేసుకోవాలి. అదియే నిజమైనటువంటి సాధన. ఈ సాధనను మీరు అభివృద్ధి చేసుకున్నప్పుడు అందరియందు కూడను దైవం ఒక్కడే ఉన్నాడు. కనుక ఎవరిని పలుకరించినప్పటికిని మనము మర్యాదగా, గౌరవంగా మనం వారిని సంభాషణ జరపాలి. ఎవ్వరితోనూ కఠినంగా మాట్లాడకూడదు. అప్పుడు కఠినంగా మాటాడినప్పుడు మన బాధను మనం గుర్తించుకోలేము. You can't always oblige but you can speak always obligingly. అటువంటి వినయ విధేయతలను మనం ప్రకటించాలి. ఎందుకంటే అందరి హృదయములందు భగవంతుడే ఉంటున్నాడు. ఎవరిని మనం విమర్శించినా భగవంతుడిని విమర్శించినటువంటి వారమవుతాము. 'సర్వభూత తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి', 'సర్వజీవ పురస్కారం కేశవం ప్రతిగచ్ఛతి', 'సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి'

**కోపతాపాది దుర్గుణాలను దూరం చేసుకోవాలి**

కనుక ఏది చేసినా కానీ మన హృదయంలో వున్నటువంటి దైవత్వానికే చెందుతుంది. మానవునికి కోపము, తాపము, ఈర్ష్య, అసూయ, ఢంబము ఇత్యాది దుర్గుణములంతా కూడను అనేక రకములుగా ఆవిర్భవిస్తుంటాయి. వాటికి ఏమాత్రము మనం అవకాశం ఇవ్వరాదు. అది అవకాశం ఇచ్చే కొలది కూడను మనం మరింత చెడిపోతుంటాము. అది వచ్చినప్పుడు నీవు మౌనం వహించు. కొంతసేపు నీవు నిశ్శబ్దముగా కూర్చో. అంతేకాని మాటకు మాటగా నీవు మాటాడినపుడు అది ద్వేషం మరింత అధికమైపోతుంది. ఇది సరియైనటువంటి లక్షణం కాదు. మనం శాంతిని పొందాలి. అందువలననే మనము 'శాంతి శ్శాంతి శ్శాంతిః' అని భజన అయిన తరువాత మూడు పర్యాయములు ఎందుకు చెబుతున్నారు? కానీ రెండు సార్లు ఎందుకు చెప్పకూడదు? లేక నాలుగు సార్లు ఎందుకు



sri sathyasai vahini

చెప్పకూడదు? మూడు సార్లే ఎందుకు చెప్పాలి? అనగా ఏమిటి?

**భౌతిక మానసిక ఆధ్యాత్మిక శాంతులు మూడూ అవసరమే**

దేహసంబంధమైన శాంతి, మానసికసంబంధమైన శాంతి, ఆత్మసంబంధమైన శాంతి. కనుక ఈ మూడింటియందు కూడను నాకు శాంతి కావాలి. శరీర, మానసిక, ఆధ్యాత్మిక శాంతి నాకు మూడు కావాలి. కనుకనే 'శాంతి శ్శాంతి శ్శాంతిః' ఈ మూడింటియందు శాంతి లేకపోతే మనము జీవించలేము. కనుక, 'ఓ భగవంతుడా! నాకు ఈ మూడింటియందు కూడను శాంతిని అనుగ్రహించు.' ఆధ్యాత్మికంలో శాంతి ఉండొచ్చు నీకు, కానీ శారీరకంగా నీవు సరైనటువంటి ఆరోగ్యం లేనప్పుడు అక్కడ అశాంతే వస్తుంది. శారీరకంగా, ఆధ్యాత్మికంగా శాంతి ఉన్నాది. కానీ మానసికంగా శాంతి లేకపోతే ప్రయోజనం లేదు. కనుక శాంతి అనేటువంటిది మూడింటియందు వుండాలి. ఈ విధమైనటువంటి ప్రార్థనలు ప్రాచీన కాలమునుండి మహర్షులు అనేక విధములైనటువంటి సాధనలు చేసి అనుభవించి, ఆనందించి జగత్తుకు అందించినటువంటి విషయాలు. అనేకమంది, అనేక రకములుగా దేవుడెక్కడున్నాడు, ఎక్కడున్నాడు, ఎక్కడున్నాడు అని తపస్సు చేస్తూ వచ్చారు. కానీ కొంతమంది విరమించుకున్నారు. మన చేతకాదు అని. మరికొంతమంది ఇంకా చేయాలి మన జీవితము వచ్చింది ఎందుకోసం? దైవాన్వేషణ సలిపే తీరాలి అని పట్టుదల పట్టారు. ఆ విధంగా పట్టుదలతో కంటిన్యూ చేసినటువంటి వాళ్ళు తపస్సునుంచి వచ్చి, 'వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' అన్నారట. మేం భగవంతుని చూచాము. ఎక్కడ చూచాము? 'వేదాహమేతం పురుషం మహాన్తం' ఆదిత్యవర్ణం'- వేయి సూర్యుల కాంతితో వున్నాడట భగవంతుడు. ఎక్కడ ఉన్నాడు? తమస్సుకు ఆవల ఉన్నాడు. దాని తర్వాతనే భగవంతుని మేము చూచాము. మీరు కూడా చూడండి, మీరు కూడా చూడండి అని పుణ్య పురుషులంతా కూడను జగత్తునకు చాటుతూ వచ్చారు. ఏమిటీ తమస్సు? మన దేహమే తమస్సు. దేహాభిమానమునకు అవతలనే వుంటున్నాడు దైవము. ఈ మనస్సే తమస్సు. ఈ మనస్సుకు అవతలనే వుంటున్నాడు భగవంతుడు కనుకనే, body is like a water bubble, mind is like a mad monkey. Don't follow the body, don't follow the mind;

srisathyasaivachanamrutam

follow the conscience. ఈ దేహము, మనస్సు రెండు కూడను తమస్సుకు సంబంధించినవి. 'తమసః పరస్తాత్' అన్నారు. ఎక్కడనో కాదు. ఏ దేశములోనో కాదు. తమస్సుకు ఆవల ఉన్నాడు. తమస్సుకు అనగా మనయొక్క మనస్సుకు శరీరమునకు, ఆవల ఉన్నాడు. ఈ 'శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం' ధర్మాన్ని ఆచరించే కోసం శరీరం ఇచ్చాడు. అయితే దేహానికి సరియైనటువంటి పోషణ చేకూర్చే నిమిత్తమై మనసునిచ్చాడు. కాబట్టి ఇవి రెండు కూడను కేవలం నెగెటివ్‌కు సంబంధించినటువంటివే. కనుక పోజిటివ్‌ను మనం పట్టుకోవాలి. అదియే ఆత్మతత్త్వము. పోజిటివ్ మనం లోపల పెట్టుకున్నప్పుడు నెగెటివ్ ఏమాత్రం కూడను పని చేయలేవు. ఆ ప్రేమ అనేటువంటి పోజిటివ్ లేకపోతే అంతా కూడను వ్యర్థమే అన్నారు. కనుక మీరు ఆ ప్రేమ అనేటువంటి దానిని పెట్టుకొండి. ఆ ప్రేమనే భగవత్స్వరూపము 'Love is GOD, Live in LOVE'. ఈ ప్రేమతత్త్వాన్ని ఎట్టి ప్రేమ? నిర్మలమైనటువంటి ప్రేమ, నిస్వార్థమైనటువంటి ప్రేమ. అనగా ఏమిటి? Self is lovelessness, love is selflessness. కనుకనే ఈ love అనేటువంటిది. Selflessness love నిజమైనటువంటి ప్రేమ. ఇది మనం పెంచుకోవాలి. తద్వారానే మనకు దివ్యత్వం అనేటువంటిది క్షణములలో మనకు ప్రాప్తిసుంది. దినాలు కాదు. సంవత్సరాలు కాదు, యుగాలు కాదు, క్షణాలలోనే మనకు ప్రాప్తిస్తాయి. ఏ స్విచ్ వేస్తే ఎట్లా లైటు తక్షణమే వస్తోందో అదే రీతిగానే మనము నిజమైనటువంటి ప్రేమతత్త్వాన్ని పెంచుకున్నప్పుడు క్షణంలోనే మనకు భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. కనుక మనము ఈ జగత్తులో వుండినంతవరకు మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించుకుంటూ, ఈ జగత్తును కూడా గౌరవిస్తూ, ఈ జగత్తు కూడను దైవస్వరూపమే. ఈ జగత్తులో ఉన్నటువంటి సమస్త పదార్థములు దైవస్వరూపమే. కనుక అన్నింటిని కూడా దైవస్వరూపకంగా భావించుకుంటుంటే ఇదే మన నిజమైన కర్తవ్యము. ఇదే నిజమైన సాధన. ఇంతకంటే మించిన సాధన మరొకటి లేదు. ఈనాడు చేసేటువంటి సాధనలన్నీ కూడను స్వార్థముతో కూడినటువంటివే. ఈ స్వార్థమనేటువంటిది దేనికోసం చేస్తున్నాం మనం ధ్యానం? దైవం కావాలని చేస్తున్నాము. కనుక నీ నిమిత్తమై చేసుకునేటువంటిదే కానీ ప్రపంచము, సమాజ నిమిత్తము చేసేటువంటిది కాదు కదా! సమిష్టి నిమిత్తమై మనము చేయవలసినటువంటిది

srisathyasaivachanamrutam

ప్రార్థన. ప్రార్థన వ్యష్టి స్వరూపమైనటువంటిది కాదు. వ్యష్టిత్వం అనేటువంటిది కేవలం భ్రష్టుత్వమే. కానీ సమిష్టి తత్త్వమే మనకు నిజమైనటువంటి వ్యష్టిత్వము. సమాజమంతా ఒక్కటే. సమాజంలో మనమొక సభ్యులము. సమాజమునకు రూపమేమిటి? రూపం లేదు. సమాజములో వున్నటువంటి సభ్యులకు రూపం వుంటుండాది. కనుక ఈ సభ్యుల వలననే అది సమాజం అని పేరు వచ్చింది. కనుకనే సమాజ నిమిత్తమై మనము ప్రార్థన చెయ్యాలి. అంతా 'లోకాసమస్తా సుఖినో భవంతు'. అప్పుడు అందరు సుఖముగా వున్నప్పుడు నేనూ సుఖముగా వుంటాను. కనుకనే నీవు ఆనందముగానే వుండాలంటే నీ స్వార్థాన్ని పక్కకు నెట్టి సమిష్టి స్వరూపంతో లోక సమస్తాన్ని గురించి విచారించు. అప్పుడు అంతా కూడను సుఖముగానే ఉంటారు. కనుక మనము దివ్యత్వాన్ని గుర్తించాలంటే మన హృదయాన్ని పరిశుద్ధం చేసుకోవాలి. ఇది పరిశుద్ధం చేసుకున్నప్పుడే పరమాత్మ తత్త్వం మనకు అర్థమవుతుంది. అద్దంలో కనిపించినట్టుగా వుంటాది.

**(తేదీ 26-04-1998న కొడైకెనాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam